ప్రజాశక్తి
గురువారం 13 జులై 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తానేటి వనిత

'పశ్చిమ' సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - విజయవాడ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా వాలంటీర్, సచివాలయ సిబ్బంది సహకారంతో వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని రాష్ట్ర హోమ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర హోమ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తానేటి వనిత అధ్యక్షతన పశ్చిమ నియోజకవర్గ స్థాయా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ప్రధానంగా వచ్చిన ఇంటి స్థలాల సమస్యలు, గతంలో కొంతమంది ఆర్‌అండ్‌బి, రైల్వే, ఇరిగేషన్ భూములలో గృహాలు నిర్మించుకుని నివాసం వుంటున్న వారికి ఏవిధంగా అక్కడ స్థిరమైన నివాసంతో భద్రత కల్పించేందుకు సమావేశంలో చర్చించామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి నియోజక వర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలను, త్రాగు నీరు, విద్యుత్ వంటి వాటిని కూడా సమావేశంలో చర్చించామని మంత్రి అన్నారు. కరోనా అనంతరం అన్ని పుణ్య నదులలో భక్తులు పుణ్యస్థానాలు అచరిస్తున్నారని, అయినప్పటికి దుర్గా ఘాట్‌ను నేటి వరకు భక్తులకు ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేదని ఆలయ ఇవో, దేవాదాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. త్వరగా కృష్ణానదిలో పుణ్యస్థానాలు అచరించేందుకు దుర్గా ఘాట్‌ను తిరిగి వినియోగింలోకి తీసుకురావాలన్నారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో దుర్గా ఘాట్‌ను శుభ్రపరిచి పోలీస్ వారి సూచనల మేరకు రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కనక దుర్గ నగర్‌లో కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాజీ మంత్రి శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆక్రమణలను క్రమబద్ధీకరించడం, శాఖల

(మిగతా 6లో)

లంక భూములకు మోక్షం

- పట్టాల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం
- 6,287 మంది సాగుదార్లకు ప్రయోజనం
- ఇప్పటికే అనుభవదారుల గుర్తింపు సర్వే పూర్తి
- ప్రాథమిక నివేదిక సిద్ధం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

వైసిపి ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో ఓట్లు రాబట్టే వ్యూహంలో భాగంగా కీలక భూ సమస్యల పరిష్కారానికి పూనుకుంది. గతంలో 18 వేల ఎకరాలకుపైగా భూములను 22 ఎ1(ఇ) నిషేధిత భూముల జాబితాలో నుంచి షరతుల గల పట్టాలకు మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం...తాజాగా లంక భూములు సాగుచేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. మంత్రివర్గ నిర్ణయంతో లంక భూములను సాగుచేస్తున్న రైతులకు ప్రయోజనం కలగనుంది. దీనిలో భాగంగా ఇప్పటికే లంకభూముల సాగుదారుల గుర్తింపు సర్వే ప్రక్రియను కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో త్వరలోనే సాగుదారులకు లబ్ధి చేకూరనుంది. మచిలీపట్నం నియోజకవర్గంలో 11 గ్రామాలు, 12,230 ఎకరాల ఎస్టైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. సుదీర్ఘకాలం సమస్యల్లో ఉన్న ఈ భూముల చిక్కులు వీడటంతో పెద్ద సంఖ్యలో లబ్ధిపొందిన వారు తమకు వచ్చే ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మారతారని ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు ఆశిస్తున్నారు.

శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు, ప్రకాశం బ్యారేజీల నిర్మాణం జరగక ముందు కృష్ణానదికి వచ్చిన వరదల్లో ఒండ్రుమట్టి కొట్టుకు వచ్చి నదీ గర్భంలో కొన్నిచోట్ల మేట వేసింది. సాగుకు అనుకూలంగా సారవంతంగా ఉండడంతో వాటిని దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల లంక భూములను వందలాది కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. గతంలో ఈ లంక భూములను ప్రభుత్వం సాగుదారులకు లీజుకు ఇచ్చేది. ఆ భూములపై వారికి ప్రతి ఏటా లీజును ప్రభుత్వం పునరుద్ధరిస్తూ వచ్చేది. ఆ లీజు ఆధారంగా బ్యాంకులు వ్యవసాయ రుణాలు ఇచ్చేవి. ప్రకతి విపత్తుల సందర్భంగా ప్రభుత్వ సహాయం అందుకునే అవకాశం ఉండేది. అయితే గత 20 ఏళ్ల నుంచి లంక భూములకు లీజుకు ఇచ్చే ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో లంక భూముల సాగుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస గుర్తింపునకు నోచుకోవడం లేదు. నదికి వరదలు వచ్చిన సందర్భాల్లో పంటలు ముంపునకు గురైనప్పుడు వీరికి ప్రభుత్వ సాయం అందడంలేదు. లంక భూములకు పట్టాల కోసం వాటి సాగుదారులు అనేకసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈనేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం అనుభవదారుల గుర్తింపు సర్వే నిర్వహించింది. కష్ణా డెల్టాలోని లంక భూములకు డి-పట్టాలిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీనికి సంబంధించి గత ఏడాది డిసెంబర్ 30న జిఒ ఎంఎస్ నెంబర్ 799ను విడుదల చేసింది. దీంతో లంకభూముల గుర్తింపునకు సంబంధించిన కసరత్తును కష్ణాజిల్లా యంత్రాంగం ప్రారంభించింది. వాటి అనుభవదారుల గుర్తింపు సర్వే నిర్వహించింది. 6,287 మంది రైతులు 3,570.80 ఎకరాలను సాగు చేస్తున్నారని గుర్తించింది. లబ్ధిదారులకు సంబంధించిన ప్రాథమిక నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. తాజాగా లంక భూములను మూడు కేటగిరీలుగా గుర్తించి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే

(మిగతా 6లో)

ప్రాపర్టీ షో బ్రోచర్ ఆవిష్కరణ దృశ్యం

14 నుండి నెరెడ్కో ప్రాపర్టీ షో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి (నేషనల్ రియల్ ఎస్టేట్ డవలప్ మెంట్ కౌన్సిల్ - నారెడ్కో) నేతృత్వంలో జులై 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు నగరంలోని ఎ ప్లస్ కన్వేన్షన్ సెంటర్ లో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు సంస్థ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు కె. ముక్తేశ్వరరావు తెలిపారు. బుధవారం నగరంలోని మధు మాలక్ష్మి ఛాంబర్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నారెడ్కో ప్రతినిధులు వివరాలను అందించారు. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ఇతర ప్రాపర్టీ షోలకు భిన్నంగా వినియోగదారుల అలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా దీనికి రూపకల్పన చేసామన్నారు. మధ్యతరగతి ప్రజల మొదలు ఉన్నత వర్గాల వరకు అందరికీ అందుబాటు నిర్మాణాల సమాచారం ఇక్కడ లభిస్తుందన్నారు. నేరేడ్కో కార్యవర్గ సభ్యుడు సందీప్ మండవ మాట్లాడుతూ గహాలను కొనుగోలు చేయాలనుకునే వారితో పాటు, బిల్డర్లు, డెవలపర్లు మాత్రమే కాకుండా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు, రియల్టీ కన్సల్టెంట్లు, తయారీదారులు, ఉత్పత్తి సరఫరాదారులు, ఇంటీరియర్ డెకరేటర్లు, ఆర్కిటెక్ట్‌లు, పరిశ్రమ నిపుణులు, విశ్లేషకులు... అలా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామన్నారు. రియల్

(మిగతా 6లో)

అంకితభావంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రతి రోజూ అంకితభావంతో ఎక్కువ సమయం ఇష్టపడి శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. బుధవారం విజయవాడలో నాలుగు రోజులపాటు జరుగుతున్న సీబీఎస్ఈ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానంపై కార్యశాలకు రెండో రోజు బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మాత్రమే నిజమైన నాయకులన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని, విద్యార్థులకు తప్పులు గుర్తింపజేసి వెంటనే వాటిని సవరించాలని అన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులనీ, ఎప్పటికప్పుడూ నూతన విషయాలను ఉపాధ్యాయులు నేర్చుకుని విద్యార్థులను సక్రమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత స్వీకరించాలన్నారు. డిజిటల్ అక్షరాస్యతలో మెలుకువలు పొంది జాతీయ సంస్థల నుంచి సాంకేతిక, సమకాలిక అంశాలను నేర్చుకుని మన పాఠశాలల్లో అమలు పరచాలని కోరారు. అక్టోబర్ 2 నుంచి మన రాష్ట్రంలో డిజిటల్ కంటెంట్ పై సర్టిఫికేట్ కోర్సును ప్రారంభించనున్నామని వెల్లడించారు. వచ్చే నెలలో జరగనున్న ఫార్మటీవ్ అసెస్మెంట్ పరీక్షల్లో 5,9,12 తరగతులు వారికి టోఫెల్ పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తమ ఫలితాలకు క్రషి చేసిన 52 మంది ఆంగ్ల ఉపాధ్యాయులను 'అమెరికాలో న్యూజెర్సీ రాష్ట్రంలో గల ప్రతిష్ఠాత్మక ప్రిన్స్ టన్ యూనివర్సిటీ'లో శిక్షణకు పంపించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక విద్యార్థిపై రోజుకు రూ. 20లకు పైగా ఖర్చు చేస్తున్నామని, ఇది జాతీయ స్థాయిలో ఐదు రెట్లు ఎక్కువని గుర్తు చేశారు. 2019లో మన రాష్ట్రంలో ప్రారంభమైన సీబీఎస్ఈ పాఠశాలలు 2024-25లో జరగనున్న సీబీఎస్ఈ బోర్డు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించనున్నామన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 1000 సీబీఎస్ఈ పాఠశాలల్లో 83 వేలమంది విద్యార్థులు చదువుతున్నారని, వీరిలో గుణాత్మక విద్యను సాధించడానికి ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. సీబీఎస్ఈ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అంచెలంచెలుగా ఒక్కో మెట్టు ఎక్కి గమ్యాన్ని త్వరలోనే చేరుకోను న్నామన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ టీవీ, ట్యాబులు, ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెళ్ల ద్వారా డిజిటల్ కంటెంట్ అందుబాటులో ఉంచామని, ఉపాధ్యాయులు వీటి ద్వారా విద్యార్థులకు అన్ని అంశాలపై తర్ఫీదునిచ్చి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. డిజిటల్ కంటెంట్ ను ఐసీటీ (ఇన్ఫర్మేషన్ అండ్

(మిగతా 6లో)

కార్యశాలకు హాజరైన అధికారులు; మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్ (అంతర్‌చిత్రంలో)

50వ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్

పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు చిన్న రామాలయం గుడి వీధిలో రూ.7 లక్షల 64 వేల అంచనాలతో సిసి రోడ్డు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బోయి సత్యబాబు బుధవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కమిషనర్ పుండ్కర్‌కి వినతి పత్రం ద్వారా తెలియజేసి మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ బోయి సత్యబాబు

కార్పొరేషన్ అభివద్ధి పనులు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల సంవత్సరాల తరబడి పెండింగ్ పడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నుండి విజయవాడ నగరపాలక సంస్థకు రావలసిన నిధులు రూ.500 కోట్లు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. స్థానిక పెద్దలు బి. రాజు, కె. నరసింహారావు, కే. శ్రీనివాస్ స్థానిక మహిళలు దుర్గ రాణి, ఫాతిమా, లక్ష్మి పాల్గొని శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందిస్తున్నామని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం మరియు పట్టణంలోని 12, 4వ సచివాలయం నందు జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను, వారి తనయులు నియోజకవర్గ యువ నాయకులు సామినేని వెంకటకష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరు ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందకుండా మిగిలి పోకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. నేడు మన జగనన్న ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ఉచితంగా

సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, కౌన్సిలర్లు పాకలపాటి సుందరమ్మ, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్, మండల పార్టీ అధ్యక్షులు మండవ శ్రీనివాస్ గౌడ్, మండల సచివాలయాల కన్వీనర్ దొంగల జానకిరామయ్య, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శ్యామల, ఎమ్మార్వో, ఎండిఓ, ఎంఈఓ తదితర అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాడం సారె సమర్పణ

ప్రజాశక్తి - వన్‌టౌన్

ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానంలోని ఆలయ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించారు. ఆలయ సెక్యూరిటీ వారి ఆహ్వానం మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ విచ్చేశారు. ఈ మేరకు భ్రమరాంబను దుశ్శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం జమ్మిదొడ్డిలోని దేవతా మూర్తుల వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, ఆలయ కార్యనిర్వాహణాధికారి, అధికారులు పవిత్ర సారె కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వీరు పవిత్ర సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకోగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం మహామండపం ఆరవ అంతస్తులో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, అందరికీ ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి పి.చంద్రశేఖర్, సెక్యూరిటీఅధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి రవీంద్ర

దుర్గమ్మ దర్శనార్థం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి. రవీంద్ర బాబు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వీరికి ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనము చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

దేవాలయ అన్నదానానికి విరాళం అందజేత :

దుర్గమ్మ ఆలయంలో ప్రతిరోజూ జరుగు నిత్య అన్నదాన పథకంనకు బొడ్డపాటి రజనీ నాగలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.1,01,116లు, శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయ శిఖరం బంగారు తాపడం పనుల నిమిత్తం రూ.1,01,116 లను ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబని బుధవారం కలిసి దేవస్థానానికి విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష : వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్

గడప గడపలో ప్రతి పేదవాడి సమస్య తెలుసుకొని పరిష్కరించేందుకు సురక్ష కార్యక్రమం రూపుదిద్దుకుందని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలంపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ వైసీపీ నాయకులు మైలవరపు కష్ణ, నత్య అకాడమీ డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి, డివిజన్ నాయకులు ముత్తా వాసు, రెవిన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

46వ డివిజన్‌లో...

పశ్చిమ నియోజకవర్గంలోని 46వ డివిజన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వెలంపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించారు. దీనిలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నామన్నారు. ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన నరేంద్రభాగ్యలక్ష్మి, వైసీపీ నాయకులు వెన్నం రజినీ, డివిజన్ నాయకులు కార్యకర్తలు, సచివాలయం సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు చౌర్యంపై రూ.12 లక్షల జరిమానా

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలో బుధవారం ఎలక్ట్రికల్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 42 బంధాలుగా మండలంలో వివిధ గ్రామాల్లో పర్యటించి 1,854 గహ సర్వీసులను, 246 వాణిజ్య సముదాయ సర్వీస్‌లను తనిఖీ చేసినట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కొమ్ము వాసు తెలిపారు. ఈ దాడుల్లో 240 సర్వీసులను అక్రమ లోడుగా గుర్తించినట్లు తెలిపారు. వీటన్నిటికి గాను 12 లక్షల రూపాయలు జరీమాన విధించినట్లు వాసు వివరించారు. విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగినఈ దాడుల్లో నూజివీడు ఈ ఈ సత్యనారాయణ, తిరువూరు డి ఈ ఈ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నర్సరీ షెడ్ నెట్ల తనిఖీ

ప్రజాశక్తి - గంపలగూడెం బుధవారం గంపలగూడెం మండలం నూతనంగా ఏర్పాటు చేసిన మిర్చి నర్సరీ షెడ్లను తిరువూరు ఉద్యాన వన శాఖ, స్థానిక మండల వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు, ఊటుకూరు కొనిజర్ల దుందిరాలపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెట్ల యజమాలతో అధికారులు మాట్లాడుతూ, విత్తన చట్టం 1966 ప్రకారం కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు మిర్చి నారు కొనుగోలు సందర్భంలో సదరు నర్సరీ యజమాని నుండి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సహిల్ అహ్మద్, సాయిశ్రీ, నరహరి, కార్తీక్, సదాశివరావులు పాల్గొన్నారు.

43వ డివిజన్లో మొబైల్ అన్నక్యాంటీన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ వారిచే నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ బుధవారం 43వ డివిజన్ ఐరన్ యార్డ్ వద్ద ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, శివాజీ, పేరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కళ్లే లలిత ట్రస్ట్ సేవలు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్

కళ్ళే లలిత అకాల మరణంతో ఆమె కుటుంబానికి దూరమైన ప్పటికీ, ఆమె జ్ఞాపకార్థంగా ప్రతినెల 12వ తేదీన పేదలకు అన్న సమారాధన కార్య క్రమం సింగినగర్‌లోని వారి నివాసం వద్ద నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. అజిత్ సింగ్ నగర్ కళ్ళే లలిత వీధి వద్ద ఈరోజు బుధవారం కళ్ళే లలితజ్ఞాపకార్థంగా పేదలకు అన్న సమారాధన, పండ్లు, అర కేజీ టమాటాలు, పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూతురు, అల్లుడు కళ్ళే సీతామాలక్ష్మి, ముప్పుడి హరీష్, కళ్లే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన తిరుమల శెట్టి సతీష్, పాల్వంచ రమేష్ ప్రతిపక్ష టిడిపిని వీడి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో బుధవారం పార్టీలోకి చేరారు. అనంతరం పార్టీలో చేరిన వారికి రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జాతీయ స్థాయి శాస్త్రీయ జానపద

నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విశాఖపట్నంలో నాట్య రవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వ ర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిం చిన జాతీయస్థాయి శాస్త్రీయ జానపద నుంచి పోటీల్లో కూచిపూడి నత్యంలో సబ్ జూనియర్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తతీయ స్థానంలో నిలిచిన సంపసాల శ్రావ్య, జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వి.సాధన సూర్యలను కొండపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) ప్రధానో పాధ్యాయురాలు బి.పద్మలత అభినందించారు. కూచిపూడి నత్యంలో చిన్నారి శ్రావ్య ప్రతిభ కనబరిచేలా శిక్షణ అందించిన నాట్య గురువులు సప్ప శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కూచిపూడిలో ప్రతిభ కనబరిచిన చిన్నారి శ్రావ్యను పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.



వక్ఫ్ ఆస్తుల సంరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మెన్ షేక్ గౌస్ మొ హిద్దిన్ అన్నా రు. బుధ వారం ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు తొలి సమా వేశం పాతబస్తీ, ఇందాద్ ఘర్ కాంప్లెక్స్ లోని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాల యంలో జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకుని, వాటిని సంరక్షించే అంశంపై చర్చించారు. త్వరలో జిల్లాలోని కొండపల్లి, నందిగామ, జగ్గయ్య పేట, తిరువూరు తదితర ప్రాంతాలలో వక్ఫ్ ఆస్తులను పరిశీలించి, అన్యాక్రాంతం అయిన వాటిని సంరక్షించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో వక్ఫ్ ఆస్తులను సంరక్షిస్తూ, పేద ముస్లింలకు ఉపయోగపడే విధంగా జిల్లా వక్ఫ్ బోర్డు పనిచేస్తుందని ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దిన్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు షేక్ సుభాని, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ నజీర్, డైరెక్టర్లు గౌస్ పాషా, షేక్ షకీల్, షేక్ గౌస్ బాషా, షేక్ ఖాదర్, షేక్ యూనిస్, ఎండి మోయిన్, ఎండి అబిద్, ఎండి ఆఫ్రోజ్, అన్సారీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ 'భవిష్యత్తు గ్యారంటీ'

ప్రజాశక్తి - గంపలగూడెం: బుధవారం స్థానిక రెడ్డి బజార్, కుమ్మరి వీధుల్లో రెండవ రోజు భవిష్యత్తు గారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరు వూరు నియోజక వర్గ ఇన్చార్జ్ చావల దేవత పాల్గొని మాట్లా డారు. అనం తరం సూపర్ సిక్స్ మేనిఫెస్టో వివిధ అంశాలతో కూడిన కరపత్రాలను ఇంటింటా అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజా రవికుమార్, యాసారపు ముత్యాలరావు, కొల్లా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
గురువారం 13 జులై 2023

మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలివ్వాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల కింద ఎస్సీ ఎస్టీలు బలహీనవర్గాల లబ్ధిదారులకు బ్యాంకు రుణాలను ఉదారంగా అందించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల సమితి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభాలో 25 శాతం మంది ఎస్సీ ఎస్టీలు ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.ఈ పథకాల కింద లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించి వారి పురోగతికి తోడ్పడాలన్నారు.తద్వారా రాష్ట్ర జాతీయ స్థూల ఆదాయ ఉత్పత్తి (జి.డి.పి) పెరుగుతుందన్నారు. ముఖ్యంగా జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా పీఎంఈజీపి పథకం కింద పరిశ్రమలు నెలకొల్పేందుకు 82 దరఖాస్తులు ఇంకను బ్యాంకుల్లో పెండింగ్లో ఉండడం సరైంది కాదన్నారు. వారికి కొల్లేటరల్ సెక్యూరిటీ అవసరం లేకున్నప్పటికీ అది కావాలని కోరడం సమంజసం కాదని అట్టడుగున ఉన్న ప్రజలను పైకి తీసుకురావాలన్నదే బ్యాంకుల ప్రధాన బాధ్యతని గుర్తు చేస్తూ వెంటనే ఈ విషయమే ప్రత్యేక దష్టి సారించి వారందరికీ బ్యాంకు రుణాలు అందించాలని సూచించారు. టిడ్కో గహాలు, పేదలందరికీ ఇళ్ల సంబంధించిన లబ్ధిదారులకు సిబిల్ రేట్లు చూడకుండా వారి ఆర్థిక స్థితిగతులను దష్టిలో ఉంచుకొని వారికి 50 వేల నుంచి లక్ష రూపాయల దాకా బ్యాంకు రుణాలు అందించి గహాల నిర్మాణం పూర్తి చేసేందుకు సహాయపడాలన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాలు అందించి ప్రోత్సహించాలన్నారు. మత్స్య సంపదకు నిలవైన మచిలీపట్నంలో మత్స్యకారులకు గత సంవత్సరం సరిగా రుణాలు అందించలేదని ఈ సంవత్సరం అయినా మరిన్ని రుణాలు అందించి వారు ఆర్థిక పరిపుష్టి సాధించేలాగా తోడ్పడాలన్నారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం 15 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని దానికి అనుబంధంగా పలు ఆధారిత పరిశ్రమలు రానున్నాయని ఈ అంశాలను ప్రత్యేక దష్టితో పరిశీలించి బ్యాంకు రుణాలను ఉదారంగా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ ఎస్టీల కోసం కేవలం ఐదు యూనిట్ల పరిశ్రమలు నెలకొల్పేందుకు మాత్రమే బ్యాంకు రుణాలు అందించడం బాధాకరమైన విషయమన్నారు. కౌలు రైతులకు రుణాల అందించి వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సిసిఆర్సి కార్డుల పంపిణీ చేపట్టిందన్నారు. వారికి తప్పనిసరిగా రుణాలు అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టి.ఎస్. జయవర్ధన్ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా సాధించిన ప్రగతి వివరాలను తెలియజేశారు.ఈ సమావేశంలో ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సప్తగిరి బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ శివరాం ప్రసాదు, డిఆర్డిఎ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జడ్పిసిసి ఒ.జ్యోతిబసు, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని రెండవ సెగ్మెంట్లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను ఎంపీపీ తుంగల సుమతి దేవి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ పరిశీలించారు. రెండో వార్డ్ లోని ఎస్టీ కాలనీలో ఈ రహదారులను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్మాణాలను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, షేక్ నజీర్ భాష, ఎంపిటిసి తోట గణేష్, మునిపల్లి వెంకట్ వసంత్ పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : జనసేన నాయకుడు మాచర్ల రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు బుధవారం వృద్ధుల మధ్య ఘనంగా నిర్వహించారు. స్థానిక బేతవోలు లోని శాంతి వద్ధుల ఆశ్రమంలో జనసేన నాయకుడు ఆర్కె పట్టినరోజు కేక్ కట్ చేసి వద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప, దివిలి సురేష్, గంట అంజి, మట్ట జగదీష్, చరణ్ తేజ్, కార్తీక్ పాల్గొన్నారు.

కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో కలంకారీ పరిశ్రమ అభివద్ధికి కృషి చేయాలని, అవసరమైన ప్రాంతాలలో తగిన సౌకర్యాలు కల్పించి జిల్లాకు మరింత గుర్తింపును తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కమిటీ సభ్యులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. 2023వ సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందజేయనున్న ఓడీఓపీఉవన్ డిస్ట్రిక్ట్ వన్ (ప్రోడక్ట్) అవార్డు నిమిత్తం జిల్లా తరపున కలంకారీ హస్తకళను నామినేట్ చేసేందుకు గాను తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కలంకారీ పరిశ్రమను జిల్లా ఐకానిక్గా మార్చేందుకు ఆయా శాఖలు సమిష్టి కషి చేయాలని సూచించారు. కలంకారీ హస్తకళలోని వివిధ దశలు, తయారీ, ఎగుమతి, కలంకారీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారి ఆర్థికాభివద్ధి వంటి వివరాలను పరిశోధించి ఓడీఓపీ అవార్డు కోసం జిల్లా తరపున కేంద్ర ప్రభుత్వానికి నామినేట్ చేయాలని చెప్పారు. ఇందుకు అధికారులు పెడన పరిసర ప్రాంతాలలోని క్షేత్రస్థాయిలో పర్యటించడంతో పాటు కలంకారీ పరిశ్రమ సొసైటీలతో చర్చించి తగిన నివేదికను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డవలప్మెంట్ కార్పొరేషన్ ఈడీ విశ్వన్, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ కె.అప్పారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ ఆర్. వెంకట్రావ్, విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ కన్సెల్టెంట్ హిమజా కుమార్, అసిస్టెంట్ ఏడీ జ్ఞాన శేఖరన్, డిఆర్ డిఏ పీడీ పిఎస్ఆర్ .ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరింత పారదర్శకంగా వైసిపి పాలన : ఎంఎల్ఏ

అవనిగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ: పాలన మరింత పారదర్శకంగా ఉండేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు తెలిపారు. బుధవారం అవనిగడ్డలోని మూడవ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఏదైనా సర్టిఫికెట్స్ కావలసి వస్తే ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా వాలంటీర్స్, సచివాలయ ఉద్యోగుల ద్వారా వారి సమస్యలను కనుక్కొని వారికి కావలసిన పత్రాలను మంజూరు చేసే కార్యక్రమం తలపెట్టడం జరిగిందన్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఎన్నో అభ్యర్థనలు సమర్థవంతంగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 1046 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతిదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, తాసిల్దార్ రామకృష్ణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, షేక్ నజీర్ బాష, గోళ్ల కృష్ణకుమారి, తోట గణేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల:** జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందించడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ అన్నారు. చిన్నకల్లేపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని చినకల్లేపల్లి, వేములపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు 348 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వి.సుబ్బారావు, గుర్తుకొండ రామారావు, వేమూరి ప్రవీణ్, మాజీ సర్పంచ్ సత్యం, డిప్యూటీ తహసీల్దార్ చిట్టిబాబు, ఎంఈఓ మొమిన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ:** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక 25వ వార్డులోని సచివాలయా పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు పాలేటి శివసుబ్రహ్మణ్యం(చంటి), వైసీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్లతో కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల:** గురజాల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, నంద్యాల సీతారామయ్య, తుళ్లూరు వెంకటరమణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు:** ఉంగుటూరు మండలం తరిగొప్పుల గ్రామ సచివాలయంలో జి.ఎస్.వి శేషగిరిరావు అధ్యక్షతన జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లడుతూ ప్రజలకు ప్రభుత్వం అందించవలసిన సంక్షేమ పథకాలకు అడ్డంకిగా ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. అనంతరం పలువునికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తరిగొప్పుల గ్రామ సర్పంచ్ వై.అనిత, ఎంపిటిసి సభ్యులు టి.నటరాజ్, పంచాయతీ కార్యదర్శి సరోజినీ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు ఉచితంగా అందించడం జరుగుతుందని ఎంపీపీ కొడాలి సురేష్ అన్నారు. మండలంలోని డోకిపర్రు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్షా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోసాల జ్యోతి, చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు శివ నాగ జయ ప్రసాద్, ఎంపిడిఒ దారపు శ్రీనివాస్, తహశీల్దారు అబ్దుల్ రెహమాన్ మస్తాన్ పాల్గొన్నారు.

గన్నవరంలో టిడిపి బస్సుయాత్ర

ప్రజాశక్తి-గన్నవరం: టిడిపి బస్సుయాత్ర గన్నవరం నియోజకవర్గంలో బుధవారం సాగింది. యాత్ర రామవరప్పాడు నుంచి విజయవాడ రూరల్ మండలం నున్న చేరుకుంది. యాత్రకు గన్నవరం నియోజవర్గంలో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. నున్నలోని అంబేద్కర్, ఎన్టిఆర్ విగ్రహాలకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలవరం కాలువపై మట్టి తవ్వకాలు వద్ద సెల్ఫీ దిగారు. సూరంపల్లి గ్రామంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న టిడిపి గన్నవరం మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు భూమిని టిడిపి నాయకులు పరిశీలించారు. వైసీపీ అక్రమాలు ఎల్లకాలం సాగవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నెట్టెం రఘురాం, టిడిపి ఎమ్మెల్సీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి : మండలి

ప్రజాశక్తి-చల్లపల్లి: టిడిపి చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సుయాత్ర శనివారం అవనిగడ్డ నియోజకవర్గానికి చేరుకుంటుందని, ఈ యాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కోరారు. బుధవారం మోపిదేవి టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే జగన్ ఇచ్చే సంక్షేమ పథకాలు అన్నింటినీ తీసేస్తారని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. జగన్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల కంటే చంద్రబాబు నాయుడు రాజమండ్రిలో జరిగిన మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టో ద్వారానే ఎక్కువ లబ్ది పేదలకు లభిస్తుందన్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని శ్రీకాకులేశ్వరస్వామి దేవాలయంలో పూజల అనంతరం ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక మీదుగా కోడూరు మండలానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రావి నాగేశ్వరరావు, జి.శివరామకష్ణ, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు

రూ.120 కోట్లతో పిహెచ్సి ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు: తాను ఉంగుటూరు హైస్కూల్లో చదువుకునే రోజుల్లో ఏదైనా జ్వరం వస్తే వైద్యం కోసం ఇందుపల్లి గ్రామానికి పది కిలోమీటర్లు నడిచి వెళ్లే వాళ్లమని, ఇప్పుడు వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. ఉంగుటూరు మండల కేంద్రంలో రూ.1.20 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన సముదాయాన్ని బుధవారం ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ పేదవాడి జీవితం బాగుండాలంటే విద్య, వైద్యం, కూడు, గూడు అందుబాటులో ఉండాలన్నారు. దీని కోసం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్స్ సభ్యులు ఎండి గౌసాని, ఎంపీపీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బిసి సెల్ అధ్యక్షునిగా విశ్వనాథ్

ప్రజాశక్తి-గన్నవరం: టిడిపి కృష్ణాజిల్లా బీసీ సెల్ అధ్యక్షునిగా నెరుసు కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా పరిసె మామిళ్లయ్యను నియమిస్తూ నియామక పత్రాలను పొలిట్బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పంచుమర్తి అనురాధ, కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, బూరగడ్డ వేదవ్యాస్, రావి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట పట్టణంలోని గాయత్రి దేవాలయ కళ్యాణ మండపంలో రాత్రి నియోజకవర్గ గాయత్రి బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట నియోజకవర్గ బ్రాహ్మణ ప్రముఖులు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రాహ్మణ ఓంకార యువజన సేవా సంఘ అధ్యక్షులు, ముక్కపేట వాస్తవ్యులు కొమరగిరి భరద్వాజ్ ని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనిలో భాగంగా జగ్గయ్యపేటలో ప్రస్తుతం ఉన్న బ్రాహ్మణ సంఘాలు అన్నింటినీ కూడా ఒకే తాటిపైకి తీసుకొస్తామన్నారు. మనమంతా ఒకటే అనే నినాదంతో మన బ్రాహ్మణుల్లో ఏ సమస్య వచ్చినా మనమంతా ముందుండేట్టుగా ఆలోచన చేసి దానిలో భాగంగా ముందుగా బ్రాహ్మణ ఓంకార యువజన సేవా సంఘాన్ని, అర్చక పురోహిత సంఘాన్ని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘంలో ఆర్.నంబర్ 112/96 లో విలీనం చేద్దామని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు పిల్లలమర్రి నాగకృష్ణ శర్మ, సంఘ అధ్యక్షులు కలవకొలను వీరాంజనేయ శర్మ, సెక్రటరీ మాడపాటి కిషోర్ బాబు, ట్రెజరర్ చైతన్య శర్మ, మహిళా అధ్యక్షురాలు కొడాలి అపర్ణ మరియు బ్రాహ్మణ సంఘం సభ్యులు కిషోర్ శర్మ, తదితరసభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాలలో 2023 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణను అందించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి వారిని పరీక్షలకు హాజరయ్యేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తామని, ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. తరగతులను 13వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం 7995593859కు సంప్రదించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా నగరాలను బిసిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్రంలో ఉన్న నగరాల కులస్తులందరినీ బిసిలుగా గుర్తించాలని కోరుతూ నగరాలలోని బిసి సంఘాల నాయకులు బుధవారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్‌ని కలిసి విన్నవించారు. నాలుగు జిల్లాలకే బిసిలుగా పరిమితమైన నగర కులస్తులను రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉన్న వారికి వర్తింపచేయాలని బిసి సంఘ నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వద్ద, అలాగే పశ్చిమ నియోజకర్గ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వద్ద విన్నవించిన విషయం విదితమే. అయితే నగరాల కులాన్ని బీసీగా అన్ని జిల్లాలకు వర్తింపజేయాలని ఆ ఫైల్ బీసీ కమిషన్ కోరింది. దీనిపై మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ స్పందిస్తూ త్వరలో తమ సమస్యను పరిష్కరించేలా చేస్తానని వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో దుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పైలా సోమనాయుడు, తమ్మిన హేమంత్, మజ్జి శ్రీను, కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, బాయిన శేఖర్ బాబు, పైలా సురేష్, ప్రముఖ న్యాయవాది పిళ్లా రవి, ఎన్ఎస్ఆర్, పొట్నూర్ శివ, బాయన కనకారావు, పిళ్లా శంకర్రావు, శీరం మల్లేశ్వరరావు ఉన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామములో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుచున్న నిత్యాన్న దాన పదకమునకు వత్సవాయి వాస్తవ్యులు గింజుపల్లి సుబ్బారావు, లత దంపతులు రూ.25116/- లు, వత్సవాయి వాస్తవ్యులు గింజుపల్లి రమేష్ రూ.25116/- లు, నాగులవంచ వాస్తవ్యులు కొమ్మినేని మోహన రావు, ఝాన్సీ దంపతులు రూ.25116/- లు, పందిళ్లపల్లి వాస్త వ్యులు రాయపాటి ప్రసాదరావు, పద్మావతి దంపతులు రూ.25116/-లు, పెదమండవ వాస్తవ్యులు ఏలూరి నాగేశ్వరరావు, లక్ష్మీరాజ్యం దంపతులు రూ.25116/- లు విరాళముగా అందజేసియున్నారు. వారికి శ్రీ స్వామి వారి ప్రసాదములు మరియు శేషవస్త్రములు అందజేయుట జరిగినది ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ సహాయకమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం కే టి ఎన్ వరప్రసాద్ తెలిపారు.

రైతు బజార్లలో సబ్సిడీపై రూ.50లకే టమాటా

ప్రజాశక్తి-విజయవాడ : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వినియోగదారులపై భారం పడ కూడదనే ఆలోచనతో రైతు బజార్లలో సబ్సిడీపై టమాటాల విక్రయాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార ఫుడ్ ప్రొసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. బహిరంగ మార్కెట్లో టమాటా ధర రూ.98 నుండి 124 వరకు ఉండటంతో రైతు బజార్లో రూ.50కి సబ్సిడీపై విక్రయించే కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టమాటా ధర వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే వరకు సబ్సిడీపై టమాటా విక్రయాలు జరుగుతాయని ఆయన చెప్పారు. 600 టన్నులకు పైగా టమాటాలను సేకరించి 6 కోట్ల రూపాయల విక్రయించామన్నారు. మదనపల్లి, పలమనేరు, ప్రాంతాల రైతులు వ్యాపారస్తుల నుండి కొనుగోలు చేసి దాదాపు 3 కోట్ల రూపాయలు సబ్సిడీ భరించి వినియోగ దారులకు అందిస్తున్నా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 103 రైతు బజార్లలో సబ్సిడీ పై టమాటలను పంపిణీ చేస్తున్నా మన్నారు. టమాటల ధరలు వినియోగదారులకు అందు బాటులో వచ్చే వరకు సబ్సిడీపై విక్రయించనున్నట్లు మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పరిశీలనలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమీషనర్ రాహుల్ పాండే, రైతు బజార్ల సిఇవో నందకిశోర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ, జాయింట్ కలెక్టర్ డా.పి సంపత్ కుమార్, మార్కెటింగ్ శాఖ జెడి శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ సిహెచ్ జాన్ విక్టర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం: మండల విద్యాశాఖ అధికారి పజ్జూరు రమేష్ బాబును యుటిఎఫ్ రెడ్డిగూడెం మండల శాఖ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయుల జీతభత్యాల విషయము ప్రస్తావించగా ప్రభుత్వం నుండి పూర్తి అదనపు బాధ్యతలు ఎఫ్ఎసి కొరకు ఉత్తర్వులు రాగానే జీతభత్యాలు చెల్లింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లల సంఖ్య ఎక్కువ ఉన్న పాఠశాలల్లో రోలు ఆధారంగా పని సర్దుబాటుకు చొరవ చూపాలని కోరారు మండల విద్యాశాఖ అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జిల్లా పూర్వ గౌరవ అధ్యక్షులు డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి భవాని, గౌరవాధ్యక్షులు తోనూరు బాల భాస్కరరావు, మండల అధ్యక్షులు. పిల్లి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు కట్ట రవిబాబు, మండల కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి వత్సవాయి : నాడు నేడు ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని కన్నేవీడు జిల్లా పరిషత్ హై స్కూల్లో నాడు నేడు ఫేస్ టు కోటి రూపాయలతో నిర్మించే అదనపు తరగతి గదులు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడేవార న్నారు. నేడు మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిహయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండేలా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చావా శ్రీధర్ దుర్గారాణి, ఎంపీటీసీ లావుడియా లక్ష్మీ,గ్రామ పార్టీ అధ్యక్షులుకుందన, వెంకటేశ్వర్లు, తిరుమలగిరి దేవస్థానం డైరెక్టర్ దారావతు బేబీ, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు లావుడియా మగత, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పర విజయరావు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సారా తయారీ బెల్లం స్వాధీనం

ప్రజాశక్తి - తిరువూరు

నిషేధిత సారాయి తయారీకి ఉపయోగించే బెల్లాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠాపై తిరువూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.గురువయ్య సిబ్బందితో కలిసి దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామానికి చెందిన సాదం సురేష్, విస్సన్నపేటకు చెందిన పాను గంటి గిరిబాబులు 2,970 కేజీల బెల్లాన్ని బొలెరో ట్రక్ వాహనంలో విస్సన్నపేట మండలంలోని తండాలకు తరలిస్తుండగా బుధవారం చంద్రుపట్ల తండా వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని గిరిబాబు, సురేష్‌లను అరెస్టు చేసి బెల్లం కొనుగోలు చేసి అక్రమంగా సారా తయారీ దారులకు సరఫరా చేస్తున్న విస్సన్నపేటకు చెందిన మాచినేని అరవింద్‌పై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు. ఈదాడులలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ వెంకటలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి వత్సవాయి: దీర్ఘకాల సమస్యలు సైతం జగనన్న సురక్ష క్యాంపులో పరిష్కారం అవుతున్నాయని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. బుధవారం వత్సవాయి మండలం కన్నేవీడు గ్రామం, కాకరవాయి గ్రామ నందు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో చెప్పులరిగేలా తిరిగినా లభించని ధ్రువీకరణ పత్రాలు నేడు గంటల వ్యవధిలో చేతికి అందుతున్నాయన్నారు. తమ సమస్య ఇంత తొందరగా పరిష్కారం అవడం చూసి రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు ఎనలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుపరిపాలన వల్ల రాష్ట్రంలోని లక్షల మంది ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నామని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో తప్ప ప్రజాప్రతినిధులు ప్రజలకు కనిపించేవారు కాదన్నారు. కానీ జగనన్న పాలనలో నిత్యం ప్రజలతో మమేకమవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ చావా శ్రీధర్ దుర్గారాణి, ఎంపీటీసీ లావుడియా లక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, సచివాలయాల కన్వీనర్ లేళ్ల నాగేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - తిరువూరు : పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న వైసిపి వాలంటీర్ల చర్యకు వ్యతిరేకంగా జనసేన కార్యకర్తలు తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో పవన్ చిత్రపటానికి జనసైనికులు బుధవారం పాలాభిషేకం చేశారు. వాలంటీర్ల లోపాన్ని ఎత్తి చూపారని కక్షతో వైసిపి ప్రభుత్వం పవన్ కళ్యాణ్ మీద బురద జల్లుతుందని జనసేన పార్టీ నాయకులు ఉయ్యూరు జయ ప్రకాశ్, పసుపులేటి రవీంద్ర, పండు, ఎల్. సుధాకర్ ఆరోపించారు.

రూ. 30లకే టమాటాలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బహిరంగ మార్కెట్లో టమోటా ఎక్కువ ధర అమ్ముతున్న నేపధ్యంలో తమ పార్టీ తరపున పేద, మధ్య తరగతి ప్రజలకు రూ. 30 లకే అందిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు కాంగ్రెసుల రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం 47వ డివిజన్ చిట్టినగర్ కుండలు మార్కెట్ వద్ద టమాటాలను స్థానిక ప్రజలకు రవీంద్ర చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీమోటా రేటు పెరుగుదల నిరసనగా టమాట రేటు తగ్గేంతవరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తరాంధ్ర జిల్లాలు ఇన్చార్జీ మాజీ ఎమ్మెల్సీ బుద్ద వెంకన్న, బీసీ మైనార్టీ నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా నేతృత్వంలో రోజుకు ఒక ప్రదేశంలో కేజీ రూ.30 లకు టమోటా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు చెప్పారు. టమోటాల పంపిణీ నేటితో ఆరవ రోజుకు చేరుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు నాగోతి రామారావు, పోతినేని లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాలు వితరణ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల భవిత సెంటర్ సమగ్ర శిక్ష న్ ఆధ్వర్యంలో స్వర్ణ టోల్ ప్లాజా కేసర వారి ద్వారా మండలంలో ఉన్న దివ్యాం గులకు ఉపకరణాలు వితరణగా ఇవ్వగా వాటిని మండల విద్యాశాఖ అధికారి పి.రమేష్ మండలంలో ఉన్న దివ్యాంగ చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల భవిత సెంటర్ ఫిజియోథెరపీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు ఇచ్చిన ఉపకరణాలు పిల్లలు చాలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని వీటి ద్వారా ఆరోగ్య రీత్యా చాలా మెరుగుదల ఉంటుందని పిల్లలకు కొన్ని ఆరోగ్య సూత్రాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఐ ఈ ఆర్ టి.ఎస్‌కే జాన్ బి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల నిరసన

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీ ఆధ్వర్యంలో జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మాటలను వక్రీకరించి వాలంటీర్లను వైసీపీ నాయకులను జనసేన కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు అని అన్నారు. ఈ విషయం అర్థం కాని వాలంటీర్లు వాలంటీర్ల ముసుగులో వైసీపీ గూం డాలు, నాయకులతో కలిసి ధర్నాలు, రాస్తా రోకోలు చేస్తున్నారంటూ ఆరోపించారు. జనసైనికులు వైసీపీపై, రోజాపై ఆరోపణలతో విరుచుకుపడ్డారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపింది. బుధవారం నాడు స్థానిక పోలీసు స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌పై వాలంటీర్లు ఫిర్యాదు చేశారు.

'జగనన్న పాల వెల్లువ'తో రైతులకు మేలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : సహకార డైరీ రంగాన్ని బలోపేతం చేసేందుకు తద్వారా మహిళల ఆర్థిక పరిపుష్టికి కృషి చేసేందుకు జగనన్న పాల వెల్లువ ఎంతో దోహదపడుతుందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో జగనన్న పాల వెల్లువ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాల వెల్లువ కార్యక్రమంనకు ప్రారంభం నుండీ మంచి స్పందన వచ్చిందన్నారు. జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను మహిళా పాడి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా సమావేశాలు ఏర్పాటుచేసి వివరించాలన్నారు. కృష్ణా జిల్లాలో పాలు ఇచ్చే పశువుల సంఖ్య 2 లక్షల 70 వేల 565 ఉన్నాయన్నారు, అలాగే పాల సేకరణ కేంద్రాలు జిల్లాలో 422 ఉండగా అత్యధిక శాతం మంది పాడి రైతులు విజయ డైరీకు పాలు విక్రయిస్తున్నారన్నారు. అమూల్ పాల సేకరణ కేంద్రాల జిల్లాలో 580 ఏర్పాటు చేయాలని ఉద్దేశించగా, కేవలం బాపులపాడు మండలంలో 10 గ్రామాలలో అమూల్ పాల కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో 8 మండలాల్లో 69 పాల సేకరణ కేంద్రాలు గుర్తించి, రోజుకు 6200 లీటర్ల పాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించు కున్నట్లు తెలిపారు. అమూల్ సంస్థలో వాటాదారులంతా అంతా పాడిరైతులే ఉంటారన్నారు. లాభాపేక్ష అనేది అమూల్‌కు లేదని, సంస్థ గడించే లాభాలన్నీ సంవత్సరానికి ఒకసారి తిరిగి పాడి రైతులకు ఇచ్చే గొప్ప ప్రక్రియ అమూల్ సంస్థ లోనే ఉందన్నారు. అధిక ధరలు చెల్లించడంతో పాటు పాల బిల్లులను కూడా కేవలం 10 రోజుల్లోనే పాడి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం వల్ల అందరికీ ఆర్థికంగా మరింత ప్రయోజనం ఉందన్నారు. సంవత్సరంలో కనీసం 182 రోజులు పాలుపోసిన మహిళా పాడిరైతులకు అమూల్ ద్వారా ఏడాది చివర్లో ప్రతి లీటర్‌పై 50 పైసలు బోనస్‌గా చెల్లిస్తున్నారని కలెక్టర్ వివరించారు. జగనన్న పాలవెల్లువకు సంబంధించి ఎపిడిడిసిఎఫ్, పశుసంవర్ధక శాఖ, సెర్ప్, పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, సహకార శాఖ, జిల్లా యంత్రాంగం, అమూల్ సాంకేతిక విభాగం సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక సంయుక్త సంచాలకులు ఎం.దినకర్ శామ్యూల్, డి ఆర్ డి ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి ఎస్ ఆర్ ప్రసాద్, జిల్లా సహకార అధికారి పి వి ఫణి కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

డైట్ సెట్ ఫలితాల్లో ప్రతిభ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఏపీ డైట్ సెట్ 2023 పరీక్ష ఫలితాలలో అవనిగడ్డ కు చెందిన అప్పికట్ల బిందు అనూష స్టేట్ మొదటి ర్యాంకు సాధించింది. బిందు అనూష బీఎస్సీ డిగ్రీ ఫైనలియర్ చదువుతూ డైట్ సెట్ రాసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రగతి కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందిన విందు అనూష స్టేట్ మొదటి ర్యాంకు సాధించడం పట్ల ప్రగతి విద్యాసంస్థలు తరపున అభినందనలు తెలిపారు. వారితోపాటు బిందువు అనూష తల్లిదండ్రులు బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

విరాళం అందిస్తున్న దృశ్యం

పోలీస్ స్టేషన్ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం : హనుమాన్ జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి రూ.4 లక్షలు విరాళం ఎన్జి ఫీడ్స్ అధినేత ఎండీ నెక్కలపూడి హరి కిరణ్ మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేతుల మీదుగా సీఐ నవీన్ నరసింహమూర్తికి ఇచ్చారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి దాతలు లక్షల రూపాయలు విరాళాలు ఇవ్వడం మంచి పరిణామం అన్నారు.

నేడు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా మరియు వేతనాల సమస్య పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటల 30 నిముషాలకు జిల్లా జిల్లా శాఖావారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కనకారావు, జె.లెనిన్ లు ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ఉపాధ్యాయులందరు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రాష్ట్రప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మచిలీపట్నం వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి గౌతమి నేత్రాలయం ఆప్తామెట్రిస్ట్ తిరుపతి 18 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఒకరికి శస్త్ర చికిత్సలు అవసరమన్నారు. వారికి రాజమండ్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తామన్నారు. విజయవాడ దుహిత డెంటల్ కేర్ వైద్యులు డా. కే. సుభద్ర 15 మందికి దంత పరీక్షలు చేసి తగు సూచన లిచ్చారు. ప్రతి నెల 2వ బుధవారం దంత, నేత్ర పరీక్షలు జరుగుతాయని, 4వ బుధవారం నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు కారుమూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చేబ్రోలు ఆశీర్వాదం, వైస్ ప్రెసిడెంట్ రాఘవరావు, ట్రెజరర్ శంకర రావు, జాయింట్ సెక్రటరి బి దుర్గారావు, యం సత్య నారాయణ, యల్ వెంకటేశ్వరరావు, సి హెచ్ నాగేంద్ర రావు, సయ్యద్ పీర్,గౌతమి నేత్రాలయం ప్రోగ్రాం మేనేజర్ భాను సతీష్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బుధవారం కోరారు. ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించేందుకు రాగా... ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా వారు భవన నిర్మాణ కార్మికులకు క్లైములు రావడం లేదని, పనులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి పనులు చూపించడం లేదని, ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజనాల సురేష్, మండల అధ్యక్షుడు నోచర్ల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి టౌన్అధ్యక్షులు వడ్డిగిరి, ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి మద్దాల రామకృష్ణ,, ఉంగుటూరు మండల అధ్యక్షులు వెలిశెట్టి నాగరాజు, గన్నవరం అధ్యక్షులు పాలడుగు శివన్నారాయణ, కార్యదర్శి బడుగు మరియదాసు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో 'జనం కోసం జనసేన'

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని రెండో వార్డ్ లో గల బీసీ కాలనీలో పట్టణ జనసేన కమిటీ ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను అవినీతిని ఎండగడుతూ ప్రచారం నిర్వహించడంతోపాటు రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను జనసేన పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీహరి, పట్టణ ఉపాధ్యక్షులు చందు బాబు, గుగులోతు కిరణ్ నాయక్, అన్నపెడ్డి ఏసుబాబు, బండ్రెడ్డి మల్లికార్జునరావు, బోనం పాపారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు ఆధ్వర్యంలో 12వ రోజు జనం కోసం జనసేన కార్యక్రమాన్ని అవనిగడ్డ పట్టణ పరిధిలో సింహాద్రి కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న బీసీ హాస్టల్ చుట్టూ ఎటువంటి ఫెన్సింగ్ లేకపోగా అపరిశుభ్రంగా ఉండంటూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నందున తక్షణమే హాస్టల్ చుట్టూ క్లీన్ చేసి ఫెన్సింగ్ వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ జనసేన పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు మునిపల్లి శ్రీలక్ష్మి, పార్టీ నాయకులు అడపా ప్రభాకర్, కమ్మిలి సాయి, భార్గవ్, అశ్వరావుపాలెం వైస్ ప్రెసిడెంట్ ఎక్కటి నాగరాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తుంగల నరేష్, ఒసూరి అవినాష్, మండలి ఉదయభాస్కర్, తోట ఆంజనేయులు, గుడివాడ రామాంజనేయులు, ఎర్రంశెట్టి సుబ్బారావు, పప్పు శెట్టి శ్రీను గుగ్గిలం అనిల్ తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో దారపు శ్రీనివాస్ సూచించారు. ఫీవర్ సర్వేలో భాగంగా మండలంలోని డోకిపర్రు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య శాఖ సిబ్బంది, సచివాల సిబ్బంది మరియు వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి డెంగ్యూ మలేరియా వ్యాధులు సోకిన వారిని గుర్తించి సీజనల్ వ్యాధులు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సచివాల సిబ్బందికి సూచించారు. కవుతరం మెడికల్ ఆఫీసర్ కె అమత ప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరికీ జాతీయ ఆరోగ్య సేవలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ అందించే చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతాబాయి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయములో జిల్లాలోని 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం కార్యాలయంలో ఏర్పాటు కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడారు. పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులందరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలసేవలను క్షేత్రస్థాయిలో ప్రజలందరూకు అందజేయాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో పాటు వారి కేంద్రాల పరిధిలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని తు.చ.తప్పకుండా అమలు చేయవలసిందిగా ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేయాలని లేనియెడల వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది వారి పరిధిలో ఉన్న ప్రజలకు సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత చూపకుండా ఆడ మగ అందరూ సమానమనే నినాదంతో ప్రజలలో అవగాహన కల్పించవలసినదిగా సూచించారు. అలాగే ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని కుటుంబ సంక్షేమ కార్యక్రమం పై ఆశా కార్యకర్తల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను కల్పించిన వి. సుందర తారక రామారావు జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ కు ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్ డిపి ఎం ఓ , డాక్టర్ రత్నగిరి, బి శివసాంబిరెడ్డి , వివిఎస్‌విఎస్ పి. ఆనంద్, బి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ మల్లాది విష్ణు, పక్కన కార్పొరేటర్ మూర్తి

సులువుగా సర్టిఫికెట్లు మంజూరు

జగనన్న సురక్షలో ఎంఎల్ఎ విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ

సమస్యలు సత్వరం పరిష్కరించడానికి "జగనన్న సురక్ష" కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలోని 33, 36 డివిజన్లలో జగనన్న సురక్ష శిభిరం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను సత్వరమే అందిస్తున్నామన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభతరం చేస్తూ.. ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు శర్వాణి మూర్తి, బాలిగోవింద్, సెంట్రల్, నార్త్ మండలాల తహశీల్దార్లు వెన్నెల శ్రీనివాస్, మాధురి, స్పెషల్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ -2 అనసూయ, వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైపాస్‌లో మొక్కలు నాటిన అధికారులు

ప్రజాశక్తి - విజయవాడ : పర్యావరణాన్ని పరిరక్షిస్తే అది ప్రజలను కాపాడుతుందని జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ఏఐ) మేనేజర్ టెక్నికల్ కె లత అన్నారు. ఆజాది క అమ్రిత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయవాడ సమీపంలోని పాతపాడు , అంబాపురం వద్ద ఎన్ హె చ్ఏఐ , మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిసర పాఠశాలల విద్యార్థులు, ఎన్‌హెచ్ఏఐ, ఎంఈఐఎల్ సిబ్బంది పాల్గొన్నారు. రోజు రోజుకు వాహనాల వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో కాలుష్యం ఎక్కువ అవుతుందని లత అన్నారు. కాలుష్యం వల్ల ప్రజలు అనేక రకాల వ్యాధులకు లోనవుతున్నారని, స్వచ్ఛమైన గాలిని పీల్చటం వల్ల సగం వ్యాధులు రావని అన్నారు. ఎం ఈ ఐ ఎల్ విజయవాడ బైపాస్ రోడ్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ముళ్ళపూడి చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ ప్రాజెక్ట్ ల పరిధిలో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటుతున్న ఎన్‌హెచ్ఏఐ మేనేజర్ (టెక్నికల్) కె లత

గృహ నిర్మాణాల వేగవంతం : కలెక్టర్ డిల్లీరావు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : జగనన్న గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలిలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్‌రేట్‌లోని వీడియోకాన్ఫన్ హాల్ నుండి జగనన్న గృహ నిర్మాణాలు, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనుల పరోగతిపై బుధవారం ఆయన ఆర్‌డివోలు, మండల స్పెషల్ ఆఫీసర్లు,మున్సిపల్ కమీషనర్లు, ఆయా శాఖల ఇంజనీర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలోని బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న గృహ నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పియంఏవై) గ్రామీణ గృహ నిర్మాణాల పై ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్‌కుమార్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, డిఆర్‌డిఏ పిడి కె.శ్రీనివాస్, హౌసింగ్ పిడి రజనీ కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వంద శాతం సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందాలనే ప్రధాన ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని అమలు అమలు చేస్తోందని వైసిపి తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దేవినేని అవినాష్, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి పేర్కొన్నారు. బుధవారం 8వ డివిజన్ గాయత్రినగర్ 272 సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 62, 63, 64, 272, 44 సచివాలయల పరిధిలో 532 మందికి సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ,8వ డివిజన్ ఇంచార్జ్ యలమంచిలి జయ ప్రకాష్, వెంకటరామయ్య, విజయవాడ నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి కృష్ణాజిల్లా సమీక్షా సమావేశం

విద్యుత్ శాఖ ఎస్ఇ మురళీమోహన్

ప్రజాశక్తి-విజయవాడ : ఎపిసిపిడిసిఎల్ విజయవాడ ఆపరేషన్ సర్కిల్ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి సమీక్షా సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు గుణదల ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎ.మురళీ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ జె పద్మజనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, లైన్‌మెన్లు, లైన్ ఇనిస్పెక్టర్లు, ఎలక్ట్రిసిటీ రెవెన్యూ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మట్టా విద్యార్థి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇంటిలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా న్యాయవాది మట్టా విద్యార్థిని నియమితులైనట్లు ఇన్ఫామ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు గెడ్డం బాపిరాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సెంట్రల్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈసందర్భంగా మట్టా విద్యార్థి మాట్లాడుతూ సంస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి రామ్ సాగర్ ఎన్నికయ్యారు.

మొదటి పేజీ తరువాయి

లంక భూములకు మోక్షం

లంక భూములు పట్టాలు ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం కూడా తెలిపింది.

మూడు కేటగిరీలు ఇలా

కష్ణా కరకట్టకు దగ్గరగా ఉండి వరద వచ్చినా కొట్టుకుపోని భూమిని ఎ కేటగిరీలో, దీనికి ఆనుకుని కొంత నదిలోకి ఉన్న భూమిని బి కేటగిరీలో, వరదలు వస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సి కేటగిరీలో చేరుస్తున్నారు. ఎ, బి కేటగిరీలకు సంబంధించి డి-పట్టాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది. సి కేటగిరీలోని భూములకు ఐదేళ్లపాటు లీజు పట్టాలు ఇవ్వనుంది. కృష్ణాజిల్లా మచిలీపట్నం, చల్లపల్లి, తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఘంటసాల, మోపిదేవి, నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు మండలాల్లోని 23 గ్రామాల్లో లంక భూములు ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో అత్యధికంగా తోట్లవల్లూరు మండలంలో, ఆ తర్వాత మోపిదేవి మండలంలో లంక భూములు ఉన్నాయి. ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న లంక భూముల సాగుదారులకు ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో ఊరట లభించనుంది. ఈభూములపై పూర్తిగా హక్కులు రావడంతో వ్యవసాయానికి అవసరమైన పంట రుణాలను బ్యాంకులు మంజూరు చేస్తాయి. రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించడంతో సంబంధిత భూముల విలువ కూడా పెరిగి రైతులకు పెద్దఎత్తున ప్రయోజనం కలుగుతుంది.

'పశ్చిమ' సమస్యల పరిష్కారానికి చర్యలు

మధ్య సమన్వయంతో పరిష్కరించవలసిన వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా 38, 40 డివిజన్‌లోని రెవెన్యూ ఇరిగేషన్ శాఖలకు సంబంధించి కరకట్ట సౌత్ ల్యాండ్, 41 డివిజన్‌లో ఇళ్ళ పట్టాలు, దర్గా స్థలం , 43 డివిజన్‌లో ఊర్మిళ నగర్‌లో 22ఏ స్థలం, 56 డివిజన్‌లో రైల్వే శాఖకు సంబంధించిన భూమి, 35వ డివిజన్‌లో పిడబ్ల్యుడికి (చెక్క పెట్టెలు)సంబంధించి స్థలం, 34 డివిజన్‌లో పప్పుల మిల్లు వద్ద హౌస్ సైట్, కాపు కమ్యూనిటి హాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, వక్ఫ్‌బోర్డ్ సంబంధించిన షాదీఖానా నిర్మాణాలు, టిడ్కో గృహాల పంపిణీ, తదితర అంశాల గురించి వివరించారు. కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ_రెవెన్యూ, నగర పాలకసంస్థ అధికారుల సమన్వయంతో నియోజకవర్గ పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో సంబంధిత ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులతో సమస్యలను సమీక్షిస్తూ పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు మంత్రికి వివరించారు. నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్_నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలు, దీర్ఘకాలిక సమస్యలను అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

సమావేశంలో నగరంలోని విద్యాధరపురం న్యూ లేబర్ కాలనీ శిధిలావస్థలో ఉందని దానిని తొలగించి ఒక్కొక్క కుటుంబానికి సెంటు స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని విద్యాధరపురం న్యూ లేబర్ కాలనీ వాసుల ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా అర్హతను పరిశీలించి నిబంధనల మేరకు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో శాసనమండల సభ్యులు యండి రుహుల్లా, నగర్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, కనకదుర్గ ఆలయ ఇవో భ్రమరాంబ, డిఇవో సివి రేణుక, హౌసింగ్ పిడి రజనీ కుమారి, నగరపాలక సంస్థ అడిషనల్ కమీషనర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

14 నుండి నెరెడ్కో ప్రాపర్టీ షో

ఎస్టేట్ పరిశ్రమకు సంబంధించిన అన్ని పరిష్కారాలకు ఇది అనువైన ప్రదేశంగా ఉంటుందన్నారు. నేరెడ్కో రాష్ట్ర కార్యదర్శి పరుచూరి కిరణ్ మాట్లాడుతూ ప్రాపర్టీ షోలో దాదాపు 50 సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయని, కొనుగోలు దారులకు ప్రత్యేక రాయితీలు కూడా అందిస్తున్నాయని వివరించారు. దాదాపు పదిహేనువేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. కార్యక్రమానికి టైటిల్ స్పాన్సరర్ గా వ్యవహరిస్తున్న ఎస్ ఎల్ వి బిల్డర్స్, డవలపర్స్ డైరెక్టర్ చైతన్య కుమార్ మాట్లాడుతూ కరోనా తరువాత విజయవాడ వేదికగా నిర్మాణ రంగంలో ఏర్పాటు కానున్న అతి పెద్ద ప్రాపర్టీ షో ఇదే కానుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్లానింగ్ కమీషన్ ఛైర్మన్ మల్లాది విష్ణు వర్ధన్, పెనమలూరు, విజయవాడ పశ్చిమ ఎంఎల్ఎలు పార్థసారధి, వెల్లంపల్లి శ్రీనివాస్, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా నారెడ్కో ప్రతినిధులు ప్రాపర్టీ షో గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి వంశీ, సుధీర్, నాదెండ్ల విజయకుమార్, పొట్టి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు

కమ్యూనికేషన్ టెక్నాలజీ) ద్వారా ప్రతి ఒక్కరిలో సాంకేతిక పరిజ్ఞానంపై కేంద్రీయ విద్యా సంస్థల అనుభవజ్ఞులచేత ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో మన రాష్ట్ర విద్యార్థులు ముందంజలో ఉన్నారని, ఎయిమ్స్, ఐఐటీలలో సీట్లు పొందుతున్నారని కొనియాడారు. విద్యలో టెక్నాలజీను అనుసంధానించడం ద్వారా రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యశాలలో క్రిస్ప్ ఏపీ స్టేట్ లీడ్ ఉషారాణి , మోడల్ స్కూల్ సెక్రటరీ .వి. కష్ణారెడ్డి , శామో జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ , రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ఎస్సీఈఆర్టీ, ప్రథమ్,

మహారాజశ్రీ విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు నందు
ఐ.ఎ. నెం. 1330/2022
ఇన్
ఓ.యస్. నెం. 78/2018

బిట్వీన్
నక్కనబోయిన కాసులు ... పిటీషనర్ / డిఫెండెంట్
అండ్
బొందలపాటి ప్రేమలత ... రెస్పాండెంట్ / ప్లెయింటిఫ్

రెస్పాండెంట్ / ప్లెయింటిఫ్ :
బొందలపాటి ప్రేమలత, భర్త : ప్రభువికాస్, డోర్ నెం. 19-13-33, బీరువాల కంపెనీ వీధి, జుడీషియల్ కాలనీ, పాత రాజరాజేశ్వరిపేట, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్ యొక్క హాజరు నిమిత్తం పై పిటీషన్ వాయిదా ది. 3-8-2023వ తేదీన ఉన్నది. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు మీరుకానీ లేదా మీ న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు నందు హాజరు కాగలరు. లేనిచో పరోక్షంగా తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు)
వాయిదాతేది: 3-8-2023
విజయవాడ
ది.10-7-2023

ఇట్లు
చందు నాగరాజు,
పిటీషనర్ తరఫు న్యాయవాది.

మహారాజశ్రీ విజయవాడ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు జడ్జి : విజయవాడ
FCOP 824/2022

బిట్వీన్ :
కరిని రవికుమార్ .... పిటీషనర్
అండ్
1) కరిని నీలిమా
2) జి.శ్రీనివాస్ @ శ్రీనివాస్ .... రెస్పాండెంట్స్

R2: జి.శ్రీనివాస్ @ శ్రీనివాస్, R/o 6-2-15/ఎ, తాడికొండ వారి వీధి, మసీదు వీధి ఎదురు, చిట్టినగర్, విజయవాడ-1.

పై నెంబరు కేసులో ఆర్2 అయిన మీకు అనేక పర్యాయములు శ్రీ కోర్టువారు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేస్తుండటంతో, శ్రీ కోర్టువారి ఉత్తర్వు ప్రకారం పై నెంబర్ కేసు మీ హాజరు నిమిత్తం ది. 2-8-2023 తేదీన వాయిదా ఉండిఉన్నది. కావున ది.2-8-2023వ తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ లాయర్ గారి ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదాతేది : 2-8-2023

కూరపాటి అనంతబాబు, ఎం.ఎ., ఎల్ఎల్.బి.,
పోలిశెట్టి శాంతారామ్, బి.ఎ.,ఎల్ఎల్‌బి.,
అడ్వకేట్స్, విజయవాడ.
ఫోన్ : 98484 58237, 93462 30495

IN THE COURT OF PRL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 346 OF 2022

Between :
State Bank of India, RACPC, Benz Circle, rep by Chief Manager, Vijayawada .... Plaintiff
And
Tiragabattina Rajani W/o Anjaneyulu, R.R. Garments & Textiles, D.No. 48-11/2-6, Autonagar, Vijayawada-10.. .. Defendant

Defendant take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs.2,90,240/- under the loan account No. 37824589289 and the said suit stands posted to 28-7-2023 for your appearance. Appear before the Hon□ble court on that day at 10-30 AM personally or through an advocte. Else next step follows

// By order //
T.V.N.Vasudeva Rao,
Advocate for Plaintiff.

IN THE COURT OF PRL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 262 OF 2020

Between :
State Bank of India, RACPC, Benz Circle, rep by Chief Manager, Vijayawada .... Plaintiff
And
Mr. Basak Raj Kumar S/o NEtal Chandra, D.No. 11-25-37, Venkata Satya Sai Complex, Near UCO bank, K.T. Road, Vijayawada-1. .. Defendant

Defendant take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs.2,72,952/- under the loan account No. 3759809587 and the said suit tands posted to 21-7-2023 for your appearance. Appear before the Hon□ble court on that day at 10-30 AM personally or through an advocte. Else next step follows

// By order //
T.V.N.Vasudeva Rao,
Advocate for Plaintiff.

ఆర్‌టిసిలో 10 శాతం రాయితీతో ప్రయాణం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఏపీఎస్ఆర్టీసీ డిపో లోని బస్సు సర్వీసులో దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే ప్రయాణికులు రానుబోను ప్రయాణం చేస్తే చార్జీలలో 10శాతం తగ్గింపుతో రాయితీ ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని దూర ప్రాంత సర్వీసులు అయినటువంటి హైదరాబాద్ విశాఖపట్నం తిరుపతి శ్రీశైలం రాయచూర్ లాంటి సర్వీసులకు రాయితీలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కావున ప్రయాణికులు ముందుగా రిజర్వేషన్ చేసుకొని సీట్లు బుక్కు చేసుకున్న ప్రతి ప్రయాణంలోనూ 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు ఈ అవకాశాన్ని అవనిగడ్డ డిపో పరిసర ప్రాంత ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు

రోడ్ల మరమ్మతులకు శ్రీకారం

ప్రజాశక్తి- మొవ్వ : గుడివాడ, చల్లపల్లి, కె.కొత్తపాలెం ఆర్ అండ్ బి రోడ్ లో మొవ్వ మండలంలో శిదిలమైన రహదారి ప్రాంతంలో మరమ్మతు పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ చొరవతో మంజూరైనరూ. 20 లక్షల నిధులతో ఆర్అండ్‌బి శాఖ ఈ మరమ్మతులను చేపట్టింది. భూమి పూజ చేసి ప్రారంభించిన ఈ పను లలో జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, కూచిపూడి పిఎసిఎస్ అధ్యక్షురాలు కైలశ్రీవల్లి, సర్పంచులు తాతా రజిని (పెదపూడి), వాకా బాలకష్ణ (యద్దనపూడి), కొండవీటి అపరబాలేశ్వరరావు, పార్టీ శ్రేణులు కైలా రమేష్, తాతా రాంబాబు, గొరుముచ్చు రాజేష్ పాల్గొన్నారు.

జంపనను పరామర్శించిన వైవిబి

ప్రజాశక్తి- ఉయ్యూరు : అనారోగ్యానికి గురై విజయవాడ రమేశ్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్ను పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ బుధవారం పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఫణికుమార్, పార్టీ నాయకులు రామ ఘవేంద్రప్రసాద్ తదితరులు శ్రీనివాస్ ను పరామర్శించారు.

గనులు, మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు : కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో తరచూ అక్రమ గనులు, మట్టి తవ్వకాలపై వార్తా కథనాలు వస్తున్నాయని వాటిపై సంబంధిత తహసిల్దార్లు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ ఓ ఎం వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు క్షేత్రాధి కారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అక్రమ గనులు మట్టి తవ్వకం, జగనన్న సురక్ష జగనన్నకు చెబుదాం విద్యా వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ గనులు, మట్టి తవ్వకాలపై ప్రత్యేక దష్టి సారించి నియంత్రించాలని బాధ్యులైన వారిపైన తగిన చర్యలు తీసుకోవాలని ఇదివరకే స్పష్టం చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ తరచూ అక్రమ గనులు, మట్టి తవ్వకాలపైన వార్తా కథనాలు ప్రచురితమవుతున్నాయన్నారు. ఈ విషయం తీవ్రంగా పరిగణించాలన్నారు. ఇకపై సంబంధిత తహసీల్దారులు వార్తా కథ నాలు రాగానే ఎప్పటికప్పుడు తక్షణమే స్పందించి ఆయా ప్రదేశాలను పరిశీలించి విచారణ చేపట్టి వాస్తవ విషయాలతో నివేదిక కలెక్టరేట్ కు సమర్పించాలన్నారు. వాస్తవం కానిపక్షంలో వార్తా కథనాలను ఖండిస్తూ వివరణలు సంబంధిత వార్తా పత్రికలకు పంపాల్సి ఉంటుందన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని తరిగొప్పుల గ్రామ సచివాలయం భవనాన్ని బుధవారం ఎంపీపీ సరోజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తెచ్చిందన్నారు. అవినీతికి కానీ, వివక్షతకు కానీ తావు ఇవ్వకూడదని, పరిపాలన అన్నది ప్రజలకు చేరువ కావాలన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. తరిగొప్పుల గ్రామ సర్పంచ్ వై.అనిత, ఎంపిటిసి సభ్యులు టి.నటరాజ్, ఎంపిడిఓ జి.ఎస్.వి శేషగిరిరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ డి.బాబురావు పాల్గొన్నారు.

'భవిష్యత్ గ్యారెంటీ' బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : తెలుగుదేశం పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో భవిష్యత్ గ్యారెంటీ బస్సుయాత్ర గురువారం నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకులు కొం డా ప్రవీణ్, చిరంజీవి, రఫీ తెలిపారు. బస్సుయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం గండిగుంట, ఉయ్యూరు తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి పర్య టించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు యనమల కుదురు రా మలింగేశ్వరస్వామి ఆలయం నుండి ప్రారంభమై నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల మధ్య సాగుతూ సాయంత్రం 5 గంటలకు ఉయ్యూ రు సెంటర్కు చేరుకుని బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు ఈ రథయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుచునిచ్చారు.

పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గుడివాడ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి నెహ్రూచౌక్ సెంటర్లో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ తమ నాయకుడు పవన్ కళ్యాణ్ వాలంటరీ వ్యవస్థలో లోటుపాట్ల గురించి మాట్లాడితే, వైసిపి నాయకులు వక్రీకరిస్తూ నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిన రాజేష్, వేమూరి త్రినాథ్, ఇంటూరి గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - మొవ్వ : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న సమగ్ర రీ సర్వేను భూ యజ మానులు సద్వి నియోగం చేసుకోవాలని తహశీల్దారు సిహెచ్. ఆంజనేయ ప్రసాద్, ఉయ్యూరు డివిజన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎస్. శివరామప్రసాద్ లు పేర్కొన్నారు.మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో బుధవారం జరిగిన రీ సర్వే గ్రామసభలో పథకం ఉద్దేశ్యాలు, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. గ్రౌండ్ ట్రూతింగ్ సమయంలో భూ యజమానులు తమ భూహక్కు పత్రాలతో హజరై సర్వే సిబ్బందికి సరిహద్దులు చూపించి నిర్ధారించుకోవాలని సూచించారు. తద్వారా భూ వివాదాలకు స్వస్తి చెప్పవచ్చున్నరు.ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన రీసర్వే ను వినియోగించుకోవాలని అధికారులు కోరారు. ఈ సభలో రీసర్వే డిటి కె.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఎ.కిషోర్, గ్రామ సర్వేయర్ అలీమ్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్డీకొట్టు అందజేత

ప్రజాశక్తి-పెదపారుపూడి : పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఓమహిళ జీవనోపాధి నిమిత్తం బడ్డీకొట్టును బుధవారం అందజేశారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని నాగపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కైలే అనిల్ కుమార్ ఇంటింటికి తిరుగుతున్న సమయంలో గొట్టుముక్కల భాగ్యమ్మ తన జీవనోపాధి విషయమై బతకటానికి బడ్డీ కొట్టు సహాయం చేయమని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ 30,000 లతో బడ్డీ కొట్టు ప్రత్యేకంగా చేయించి ఆ పేద మహిళ కొద్దిపాటి వ్యాపారం చేసుకొనుటకు సహాయం చేశారని గ్రామ సర్పంచ్ నాగదేసి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపీ గోగం సురేష్, సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, పాములపాడు సర్పంచ్ ప్రత్తిపాటి హర్షవర్ధన్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి రాజేష్, కాకి కోటేశ్వరరావు, రాజ బోయిన రాంప్రసాద్, చిగురుపాటి శ్రీధర్, వాలంటీర్ చల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'జగనన్న అమ్మఒడి'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కష్టించి విద్యను అభ్యసించి ఉన్నతమైన మార్కులు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి జి గోపాలరావు కోరారు. మండలంలోని విన్నకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న అమ్మవారికి అర్హులైన మొత్తం 2130 మంది తల్లుల ఖాతాలో సొమ్ము జమ అవుతుందని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు, బెల్టు ప్రతి విద్యార్థికి అందజేస్తున్నాం కాబట్టి వాటిని జాగ్రత్తగా వినియోగించుకొని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం విజయకుమార్, గ్రామ సర్పంచ్ ముత్యాల సాంబయ్య, సి ఆర్ పి నాగరాజు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాకు బారులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : టమాటా ధర మార్కెట్లో వంద రూపాయలు దాటిన పరిస్థితుల్లో రైతు బజార్లో ప్రభుత్వం సబ్సి డీపై రూ.50కు అంద జేస్తున్న టమాటాల కోసం ఉయ్యూరులో వినియోగదారులు బారు లు తీరారు. మార్కెట్లో టమాటా ధర పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితుల్లో సబ్సిడీపై రైతుబజార్లో అమ్మకం ప్రారంభించడంతో పొడవాటి క్యూలైన్లలో వేచిఉండి కొనుగోలుచేశారు.

చింతలమడ బాధితులకు తీవ్ర నష్టం : టిడిపి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అసమర్ధత వల్ల చింతలమడ రోడ్డు ప్రమాద బాధితులకు నష్టం జరిగిందని టిడిపి నాయకులు విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయం వద్ద విలేఖరితో మాట్లాడుతూ సోమవారం రాత్రి ప్రకాశం జిల్లా దర్శి లో శుభకార్యానికి వెళుతూ బస్సు ప్రమాదంలో ఆరుగురు చనిపోవడంతో అక్కడ ఎమ్మెల్యే వెంటనే స్పందించడంతో మృతి చెందిన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ 10 లక్షలు ప్రకటించి గాయపడిన వారికి రూ రెండు లక్షలు ప్రకటించిందన్నారు. అదేవిధంగా 2022లో మే 26వ తేదీన చింతలమడ గ్రామ ప్రజలు శుభకార్యానికి వెళుతూ ప్రమాదవశాత్తు ఐదుగురు మృతి చెందగా 18 మంది తీవ్ర గాయాల పాలయ్యారన్నారు. చింతలమడలో చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ మూడు లక్షలు, తీవ్ర గాయాల పాలైన వారికి 50 వేల రూపాయలు అందజేశారని, అయితే సోమవారం దర్శిలో జరిగిన ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి పది లక్షలు ప్రకటిం చడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అసమర్ధత వల్లే చింతల్మడ బాధితులకు నష్టం జరిగిందని మతుల కుటుంబాలకు ఏడు లక్షల వరకు నష్టం జరగకగా గాయాల పాలైన ఒక్కొక్కరికి రూ, 1,50,000 వరకు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పార్టీ నాయకులు బండే రాఘవ, మాచవరం ఆదినారాయణ, మండలి రామ్మోహన్రావు, లింగం బాబురావు తదితరులు పాల్గొన్నారు

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యా రంగానికి అందిస్తున్న ప్రభుత్వ సహకారానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తోడు కావటం అభినందనీయమని కలెక్టర్ యస్ డిల్లీరావు అన్నారు. స్థానిక అజిత్ సింగ్ నగర్ లోని ఇందిరా నాయక్ నగరంలో బుధవారం హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, డాక్ సెల్ జాతీయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ పోస్టు మాస్టర్ ఆర్ రామచంద్రరావు, చుక్కపల్లి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, శాసనసభ్యులు మల్లాది విష్ణు వర్ధన్, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుడ్కర్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ సామాన్య పోస్టు మాస్టర్ ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన్నప్పటికి స్వచ్ విజయవాడ కు సహకారం అందించేందుకు ముందుకు రావడం అబినందనీయమన్నారు. 26 సంవత్సరాల నుండి పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తూ ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయులు అయ్యారన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయి చేరుకోవాలన్నారు. వీటితో పాటు రామచంద్రరావు మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం ఒక అలవాటుగా చేసుకుని స్వచ్ విజయవాడకు సహకారం అందిస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, శాసనసభ్యులు మల్లాది విష్ణు వర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యరంగానికి తొలి ప్రాధాన్యత ఇచ్చి ఉచితంగా జగనన్న విద్య కానుక కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. వీటితో పాటు ప్రతీ సంవత్సరం దాతలు ముందుకు వచ్చి తమ సహకారన్ని అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు త్రిపుల్ ఐటి వంటి ఉన్నత చదువులకు టాప్ ర్యాంకులుగా నిలుస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుడ్కర్ మాట్లాడుతూ విశ్రాంత పోస్టు మాస్టర్ రామచంద్రరావు కాలనీలలో మొక్కలను నాటి స్వచ్ఛత పై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. కాలనీ రహదారికి ఇరుపక్కల మొక్కలు నాటి వాటి సంరక్షించడం వల్ల నేడు ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ అవుతు శ్రీ శైలజరెడ్డి, చుక్కపల్లి ఫౌండేషన్ సాత్విక్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్ డిల్లీరావు

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు లభించాయని జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు తెలిపారు. రింగురోడ్డు వద్ద గల ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నగరంలోని ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, సుధీర్ టింబర్ డిపో సిఎంఆర్ జ్యూయలరీ, వరుణ్ మోటార్స్, ధృవంత్ సొల్యూషన్స్ సంస్థలు జాబ్‌మేళా నందు పాల్గొన్నాయని తెలిపారు.

మొత్తం 47 మంది అభ్యర్థులు హాజరుకాగా అర్హతలను పరిశీలించిన తరువాత 21 మందికి ఉద్యోగం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉపాధి అధికారి రామమోహన్‌రెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధి అధికారి విక్టర్‌బాబు, ఉప ఉపాధి అధికారి టి.జవహర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి మధు, సీనియర్ అసిస్టెంట్ టి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

'ఎల్‌వి ప్రసాద్'కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: నగరంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అరుదైన గౌరవం లభించిందని ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గుళ్లపల్లి ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. యుకెలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో నిర్వహించిన 106వ ఆక్స్‌ఫర్డ్ ఆప్తల్మాజికల్ కాంగ్రెస్‌లో ఎల్‌వి ప్రపసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అధ్యక్షులు డాక్టర్ గుళ్లపల్లి ఎస్.రావు పాల్గొని ప్రసంగించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆప్తల్మాలజిస్ట్ సబ్జెక్టుపై మొదటిసారిగా పాల్గొన్న వ్యక్తిగా అరుదైన గౌరవం లభించినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పలువురు వైద్యులు పాల్గొన్న ఈ సదస్సులో కాన్నియా కేర్ సిస్టమ్ ఎవల్యూషన్ అనే అంశంపై ప్రసంగించినట్లు తెలిపారు. రానున్న కాలంలో కూడా ఎల్‌వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థలో మరిన్ని ఆధునాతన సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక 25వ డివిజన్ అరండల్‌పేట ఉర్దూ స్కూల్ విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ జరిగింది. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతల భర్త భాస్కరరావు ఈప్లేట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 రోజులు నిషేధాజ్ఞలు : సిపి

ప్రజాశక్తి-విజయవాడ: నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో వచ్చే నెల 28 వరకు 50 రోజుల పాటు యు/ఎస్ 144 (2)సి.ఆర్.పి.సి . క్రింద నిషేధాజ్ఞలు విధించడం జరిగిందని నగర పోలీసు కమిషనర్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ కాంతిరాణాటాటా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇబ్రహింపట్నం, భవానిపురం, వన్‌టౌన్, టూటౌన్, ఎన్.ఎస్.పురం, ఏ.ఎస్.నగర్, నున్న, గవర్నర్ పేట, సూర్యారావు పేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలలో నలుగురు లేదా అంతకుమించి ఎక్కువ మంది జనం బహిరంగ ప్రదేశాలలో గుమిగూడరాదన్నారు. కర్రలు,రాళ్లు, ఇతర మారణాయుధాలు పట్టుకుని తిరగరాదన్నారు.

నేరాలు జరగకుండా చూడాలి

నగరంలోని అన్ని ముఖ్య ప్రదేశాలలో బుధవారం విజిబుల్ పోలీసింగ్, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి కొంత మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసే కంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రెడాయ్ విజయవాడ ఉమెన్స్ వింగ్ కోఆర్డినేటర్‌గా వి. జయలక్ష్మి, సెక్రటరీగా తుమ్మల దుర్గాభవాని ఎంపికయ్యారని క్రెడాయ్ (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) విజయవాడ ఛాప్టర్ అధ్యక్ష, కార్యదర్శిలు డి.రాంబాబు, వి.శ్రీధర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గుణదలలోని హయత్ హెూటల్‌నందు బుధవారం ఉదయం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిటిసిపి డైరెక్టర్ ఆర్.జె. విద్యుల్లత, క్రెడాయ్ నేషనల్ సౌత్ జోన్ జాయింట్ సెక్రటరీ రాజా శ్రీనివాస్‌లతో పాటు పలువురు హాజరయ్యారని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా క్రెడాయ్ విజయవాడ ఛాప్టర్ ఉమెన్స్ వింగ్ 56 మంది సభ్యత్వంతో ప్రారంభమైందని తెలిపారు. ఈసంస్థ రానున్న కాలంలో సామాజిక కార్యక్రమాలను నిర్వహించనున్నారని తెలిపారు. క్రెడాయ్ సంస్థ ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రియల్ ఎస్టేట్ నిర్వాహకులకు సంబంధించి వివిధ కార్యక్రమాలను నిర్వహించిందని రానున్న కాలంలో కూడా మహిళా వింగ్‌తో కలసి పెద్ద ఎత్తున వివిధ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

కూచిపూడి నృత్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: పట్టణంలోని 6 వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కూచిపూడి, భరతనాట్య శిక్షణ కేంద్రం (కూచిపూడి నత్యాలయం) ను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం ప్రారంభించి, నిర్వాహకులకు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం కూచిపూడి నత్య ప్రదర్శనలో ఎన్నో అవార్డులు సాధించిన నిర్వాహకురాలని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ(కట్టప్ప), కో ఆప్షన్ సభ్యులు మన్నెం దాసు, నియోజకవర్గ పూలే అంబేద్కర్ రాజ్యాంగ సమితి అధ్యక్షులు యారగొర్ల రామారావు, వై గీతా రాణి, దుబ్బాకుల హరిప్రసా,ద్ కొండ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలో గల కాలనీలలో సాధారణ నిధులు రూ.30 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు మరియు సిసి డ్రైనేజీల నిర్మాణ పనులకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నందిగామ పట్టణ అభివద్ధి పై ప్రధానంగా దష్టి కేంద్రీకరించామని, పట్టణానికి ధీటుగా వార్డుల అభివద్ధికి కూడా ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటికే నందిగామ పట్టణంలో రూ.15 కోట్లతో మేజర్ డ్రైనేజీల నిర్మాణాలను పూర్తి చేసామని, పట్టణంలో ప్రధాన రహదారులను విస్తరించామని గుర్తు చేశారు. అదేవిధంగా వార్డులలో అంతర్గత డ్రైనేజీల ఏర్పాటుతో పాటు రోడ్ల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, కమిషనర్ డాక్టర్ జయరాం, వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నమ్మ, ఏఈ ఫణి శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు బాపట్ల సాంబయ్య, బండారు గంగమ్మ, పాకాలపాటి కిరణ్, షేక్ యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు మార్చండి : గద్దె

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: తూర్పు నియోజకవర్గంలో ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనువుగా దగ్గరగా ఉండేందుకు పోలింగ్ కేంద్రాలు మార్పు చేయాలని శాసన సభ్యులు గద్దె రామమోహన్ జిల్లా కలెక్టర్ డిల్లీరావును కోరారు. బుధవారం ఉదయం బందరురోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావును కలిసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని కొన్ని బూత్ కేంద్రాలు 27, 28, 29, 30, 31, 32, 43, 60 ఈపోలింగ్ కేంద్రాల్లో మొత్తంగా 6390 మంది ఓటర్లు ఉంటే అందులో 5500 మంది ఓటర్లు మూడు కిలో మీటర్లు పైగా ప్రయాణం చేయాల్సి ఉందని చెప్పారు. వీరందరి పోలింగ్ కేంద్రాలు నేషనల్ హైవే దాటుకుని ఆంధ్ర లయోలా కళాశాల, గుణదల ప్రాంతంలోని పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం ఓటర్లు రెండు కిలో మీటర్లు పరిధిలోనే పోలింగ్ కేంద్రం ఉండాలని, వాస్తవానికి ఇక్కడి ఓటర్లు మూడు కిలో మీటర్లు దాటి రావాల్సి ఉన్నందున ఓటర్లకు దగ్గరగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు వత్సవాయి ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి-వత్సవాయి: వత్సవాయి ఎంపిపి పదవి కోసం 13వ తేదీ గురువారం ఎన్నిక జరగనుంది. ఎంపిపి పదవి కోసం మక్కపేట, వత్సవాయి, పోలంపల్లి, మంగోల్లు తదితర గ్రామాల నుండి ఎంపిటిసిలు పోటీ పడుతున్నారు. మండలంలో 18 ఎంపీటీసీలు ఉండగా తాళ్లూరు, లింగాల, ఇందుకుపల్లి గ్రామాల నుంచి ముగ్గురు టిడిపి ఎంపీటీసీలు కైవసం చేసుకున్నారు. మిగతా 15 మంది వైసిపికి చెందిన ఎంపిటిసిలు ఉనానరు. డబ్బాకుపల్లి ఎంపీటీసీ చెమ్మేటి వెంకటేశ్వరరావు ఎంపీపీగా ఉంటూ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వేములనర్వ ఎంపీటీసీ ఏఎంసీ చైర్మన్ బాధ్యతలు చేపట్టడంతో స్థానిక ఎంపీటీసీగా రాజీనామా చేశారు. దీంతో వైసిపికి 13 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ స్థానం బీసీ రిజర్వుడు కావడంతో మరలా బిసి అభ్యర్థికే కేటాయించాలని కొందరు, మరికొందరు వైస్ ఎంపీపీ స్థానంలో ఉన్న వ్యక్తులకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. వత్సవాయి, మక్కపేట గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు ఎంపీపీ పదవి కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రొ ఫైనాన్స్‌ను ప్రారంభించిన 'అర్జూ'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: కన్స్యూమర్ డ్యూరబుల్ రిటైలర్ వ్యాపారాలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దడానికి అర్జూ సంస్థ ఫిన్‌టెక్ ప్రొ ఫైనాన్స్ సర్వీసును ప్రారంభించినట్లు సంస్థ సీఈవో కె.ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్ రిటైల్ కోసం అత్యాధునిక చెక్ అవుట్ సొల్యూషన్‌ను తీసుకువచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలియచేశారు. దీనితో ప్రతి ఒక్క స్టోర్ శక్తివంతంగా మారుతుందని, అన్నారు. దీని ద్వారా వినియోగదారులకు కావాల్సిన విధంగా ఫైనాన్స్ అందించి తగిన విధంగా సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్జూ ప్రొ ఫైనాన్స్ వినియోగదారునికి మన్నికైన ఫైనాన్సింగ్, చెల్లింపులతో అధిక విలువ కలిగిన రిటైల్ రంగానికి తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ మొదలైన చెక్‌అవుట్ సొల్యూషన్‌లను అందిస్తుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్థంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.